కథానిక

# అర్థంకాని గోపాలం

ఆర్. యం. చిదంబరం

ఈమధ్య మా మిత్రులందరికీ పట్టుకున్న విచారం వొక్కటే-ఉద్యోగాలు లేవని-జీతం చాలటం లేదని-ఇంట్లో ఎవరికో జబ్బుగావుందని-ఇలాంటి బాధలన్నీ మర్చిపోయి మా గోపాలాన్ని గురించే విచారించాం. వాడింతవరకూ బాగానే వుండేవాడు. డి. యి. ఓ. ఆఫీసులో గుమాస్తాగావున్నా మంచి దర్జాగా-ఠీవిగా గెజిటెడ్ ఆఫీసరులా వుండేవాడు. ఎప్పుడూ హనావా పేంటులు - టస్సరు బుష్‌కోట్లు వేసుకుని తిరిగేవాడు; అయితే వాడిలా అమాంతం పిచ్చివాడైపోవటం మాకు చాలా బాధ కలిగించింది. ఎంతో సరదాగా వుండేవాడల్లా —ఏదో మౌనంగా ఆలోచిస్తూ - మధ్యమధ్య అగ్నిపర్వతం బద్ధలై లావా ప్రవహించినట్టు ఏదో వాగేస్తూ తయారయ్యాడు. అతనితో మాట్లాడేసరికి మా భావాలూ - మైలురాళ్ళలా తిష్టవేసుకున్న మా నిశ్చితాభిప్రాయాలూ మారిపోతున్నాయి.

ఇంతకీ వాడు అమాంతం 'భావకవి' అయి కూర్చున్నాడు. అంటే భావకవులందరూ పిచ్చివాళ్ళని మేం అనటంలేదుకాని మా గోపాలం విషయంవరకే మాపూచీ.

క్లాసులో అందరం ఛందస్సుకు అప్పన్నంగా అయిదుమార్కులు తెచ్చుకున్నా మావాడు మాత్రం 'టూపైఆర్' తెచ్చుకునేవాడు. మూడు నాలుగుసారులు నూరిపోసినా ప్రయోజనం లేకపోయింది. ఉన్నట్టుండి వాడు కనిపించటమానేశాడు. ఇంక కూపీతీస్తే వాడు లైబ్రరీలో తెలుగు పుస్తకాలు నములుతున్నాడని తెలిసింది. తనకు తెలుగులో ఫస్టుమార్కు ఎక్కడెగిరి పోతుందో అని మా ఆచారి గడగడవణికిపోయాడు. అంచేత గోపాలం పద్యాలమీద శీత కన్నువేసి గేయాల మీదికి దాడితీశాడు.

ఇంతకీ వాడి రచనొకటి ఏదో పత్రికలో పడింది. దాంతో వాడికి పుష్పకవిమానంలో ఆకాశయానం చేస్తున్నట్టనిపించింది. ఈ సంగతి రచన పడిన పదిరోజులకుకాని మాకు తెలిసిందికాదు. ఒకనాడు కంగారు కంగారుగాపోతున్నాడు గోపాలం - అతని వేషంచూసి హడలిపోయాను. సూటువేయటం మానేసి గ్లాస్కోపంచె బిళ్ళగోచీ పోసికట్టాడు - లాల్చీ తొడిగాడు హైరోడ్డు క్రాఫింగు కూడా మొదలుపెట్టాడు.

"గోపాలం!..." అంటూ చప్పట్లు కొట్టాను. అతను మాట్లాడకుండా వెళ్ళిపోతుంటే వినిపించ లేదుగామోలని మళ్ళీ పిలిచాను. ఈసారి వెనక్కి తిరిగిచూసి ఆగాడు. గబగబా దగ్గరకెళ్ళాను.

"ఏవోయ్!... బొత్తిగా కనిపించటం మానేశావ్? ఫక్కీ అంతా మార్చేశావే?... పెళ్ళికానీ అయిందేమిటి?...మమ్మల్ని పిలవకుండానే పెళ్ళి చేసేసుకున్నావటోయ్?" అన్నాను.

"వెధవపెళ్ళి...అదొక సుడిగుండం-మానవుడికో గండం-వివాహం- నీచుల దాహం" అని యింకా ఏదో అనబోతుంటే నాకు భయంకూడా వేసింది. చేత్తో ఏవో సైగలు చేశాడు. అది మొదట్లో అర్థంకాకపోయినా వాడు కవయ్యాడని తెలిసిన తరువాత బహుశా తగినమాటలు దొరక్క బాధపడుంటాడనుకున్నా.

"దానికేంలేకాని నీ స్టయిలు మారిందేవిటి? ఏవైనా నీదగ్గర స్నేహితుడినికదా!...ఆమాత్రం వినటానికి నోచుకోలేదూ?"

వాడు నవ్వుతూ "వివాహం-నీచుల దాహం-లేదు నాకు మోహం" అన్నాడు.

"చాలు సహం" అని నేను పూర్తిచేశా.

"నా రచన నువ్వు పత్రికలో చూడలేదుగామోలు!" అంటూ తల పైకెత్తి నవ్వాడు.

"అరెరె...చూడలేదే!... అయితే భావకవివయ్యావన్నమాట... బాగుంది. కాని స్కాట్ ఏమన్నాడో తెలుసా? నిజమైన కవికి ఆడంబరం వుండకూడదన్నాడ"ని వుచితంగా సలహా ఇచ్చాను.

మేమంతా రైలుబడ్డీదగ్గర మామూలుకంటె వోగంట ఎక్కువ కూర్చుని గోపాలానికి వేప గింజంత వెర్రివుందని తేల్చాం.

మర్నాడు సాయంత్రం గోపాలం పార్కులో కనిపించాడు. అతనికి కొంచెం దూరంలో ఇద్దరు అమ్మాయిలున్నారు. వాడు నన్ను చూడగానే రమ్మని సైగచేశాడు. ఆ ఇద్దరిలో ఒకామెవాలు చూపులు-మల్లెపూల నవ్వులు విసురుతూ మావాడి కేసి మధ్యమధ్య చూస్తోంది. నిజం చెప్పాలంటే నాకు భయంవేసింది. గోపాలం చేతిలో కలం కాగితంపట్టుకుని ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. మధ్యమధ్య నీలాకాశంకేసిచూస్తున్నాడు. బహుశా భావాలకోసం ఆకాశంలో వెతుకుతున్నాడు గామోలు!...

'ఏమిటోయ్ ఆలోచిస్తున్నావు?' అనడిగాను. అతను మాట్లాడకుండా చుట్టూ చూశాడు. నిన్న మేం చేసిన నిర్ణయంలో తప్పుందనుకోము.

'భావాలకోసం గాలిస్తున్నావా?' అన్నాను.

'అబ్బే!...భావాలు కోకొల్లగా ముందువచ్చి పడుతున్నాయి — ఏరత్నాన్ని ఏరుకోటమాని చూస్తున్నా-' అంటూ ఆవిలాసినులకేసి చూసి నవ్వాడు. వాళ్ళుకూడా నవ్వారు. అయోమయంగా చూశాను.

"ఈగేయం వింటావా?" అన్నాడు గట్టిగా - అవి నన్నుద్దేశించి అన్నమాటలైతే అంతగట్టిగా అనక్కర్లేదు. "అమృతాంజనం తెచ్చుకోలేదు" అందామనుకున్నా.

"విను వీధిలో వోపతాకం
అందులో వోతటాకం
నవ్వింది ప్రేయసి
ఏడ్చిండి రోదసి-"

"ఆపవోయ్...ఇందులో భావం?"

"ఎంతైనావుంది...ఇందులో బ్రహ్మాండమంతా యిమిడివుందనుకో—నీకు చెప్పినా అర్థంకాదులే - ఎందుకు—మరి భావకవిత్వమంటే ఏమనుకున్నావ్? అదీకాక వుద్రేకంలో రాసేసినదానికి ఇప్పుడు జవాబు చెప్పమంటే ఎలాగ?...ఆ మహత్తరాకాశాన్ని—పులకరించి పొంగిపొరగే ప్రకృతి సుందరి వలపుల్లో దొర్లుతున్న ముత్యాలకాంతి పుంజంలో అలాంటి వుద్రేకం వస్తుంది." అన్నాడు.

"బాగుంది...నీ గేయాలు చదువుకుని అర్థం చేసుకునేశక్తి నాకులేదు బాబూ—అవన్నీ ఓకట్ట కిందకట్టి నాకిస్తే జాగ్రత్తపడి చదువుతాను." అన్నాను. బల్లమీద పర్సుండటంచూసి తీశాను— "ఇదెవరిదోయ్?" అనడిగాను.

"ఆ...నాదే!...ఇదెలా బయటకొచ్చింది?"

"అదేవిటోయ్!...అంతనుమానంగా చూస్తున్నావు. ఇక్కడుంటే తీశాను."

వాడు నోట్లన్నీ బయటకుతీసి లెక్కపెట్టుకున్నాడు. యాభైరూపాయలున్నాయి. ఇదంతా ఆ సుందరులు గమనిస్తూనే వున్నారు.

"ఇంతకీ వోచిక్కువచ్చి పడిందోయ్-మావాళ్ళు మా మామయ్య కూతుర్ని చేసుకోమని చంపుతున్నారోయ్! కాని నాకదిష్టంలేదు."

"ఎంచేత? మీ మావయ్య మర్యాదస్తుడు కాడా? డబ్బులేదా? అమ్మాయి బాగుండదా?" అన్నాను. "అబ్బే—అదేదీకాదురా!...అమ్మాయి బాగానే వుంటుంది. కాని నాగేయాలంటే ఆమె కిష్టంలేదు. తెగించి మొన్న చదివివినిపిస్తే "ఇవేం గేయాలు!...నా మొహం" అని తీసిపారేసింది నా కవిత్వాన్ని హర్షించనిదాన్ని ఎలాచేసుకోను?"

"లారెన్సుకు మల్లే నీక్కూడా ఓఅమ్మాయి దొరుకుతుందనుకుంటున్నావా?"

"అయితే నాకవిత్వం చెత్తంటావా?"

"నిస్సందేహంగా" అందామనుకున్నానుకాని వాడిహృదయం దెబ్బతింటుందని అలా అనలేదు.

"అందచందాలతో నాకు పనిలేదు - ధనంతో అసలు పట్టింపులేదు నాకు. నాక్కావలసింది నా కవితాకన్యకు గౌరవం-ఆదరణ."

"ఎస్. గోపాలంగారంటే మీరేనా?" అని ఇందాకటి అమ్మాయి తన మధురకంఠం విప్పింది.

"అవునండి" అన్నాడు మావాడు.

"నమస్తే—మీ గేయం చదివి ఎంతో ఆనందించాం. ఇప్పటికాలానికి మీలాటివాళ్లే కావలసింది. మిమ్మల్ని కల్సుకున్నందుకు మేమెంతో అదృష్టవంతులం." అనింకా ఏమేమో అంది.

"మిమ్మల్ని మాయింటికి టీకి రావలసిందిగా ప్రార్థిస్తున్నాం. మీరు వస్తే ధన్యులం" అంది రెండో అమ్మాయి.

"తప్పకుండా పదండి...అన్నట్టు నీకేదో అర్జంటు పనుందిగామోలు! మరి వెళ్ళొస్తావా?" అన్నాడు నాకేసి తిరిగి. సరేనని వచ్చేశాను.

మర్నాడు సాయంత్రం గోపాలం పార్కు బయట కనిపించాడు. నిన్నటికంటె వుత్సాహంగా వున్నాడు.

"ఓ పెద్దగేయం రాశానోయ్! అదీ తలిమావి కలిపి వో పుస్తకంక్రింద ప్రకటిద్దామనుకుంటున్నా- దైవాధీనం ప్రింటర్సువాళ్ళు ఒప్పుకున్నారుకూడా- యూభైరూపాయలిమ్మన్నారు" అన్నారు.

"మంచిది - శుభస్యశీఘ్రం" అన్నాను.

"ఏడ్చినట్టేవుంది.నీసలహా-మరిడబ్బు"అన్నాడు.

"అదా!...అది నిన్నటిమిత్రుల కిచ్చాను."

"హారి ఫూలా!... వాళ్లు నువ్వనుకున్నలాంటి అమ్మాయిలు కారురా!...వాళ్లు భోగంపడుచులు- తెలిసిందా?"

ఈ మాటలువిని వాడు నోరు బంగాళాఖాత మంత తెరుస్తాడని - వెనక్కి తూలిపోతాడని - ఇంకా ఏవేవో అనుకున్నాను. కాని ఏదీ జరగ లేదు. వాడు తృప్తిగా నవ్వాడు.

"అదినాకు తెలియదనుకున్నావా?...ఎవరైతే నేం? నా కవితాకన్యను ఆదరించినవాళ్ళను నేను ప్రేమిస్తాను. ఏం?...వాళ్ళకుమాత్రం హృదయం లేదనుకున్నావా? కవిత్వాన్ని అర్థంచేసుకుని, ఆనందించి ఆదరించే అర్హత వాళ్ళకులేదా?" అనింకా వాడేదో వుద్రేకంలో అంటూంటే వాడి కున్న వేపకాయంతవెర్రి టెంకాయంత అయిం దనుకున్నాను.

"అయితే వాళ్ళతో వూరేగు. సంఘం నీమీద వుమ్మేస్తుంది."

"వెధవసంఘం——

సంఘం అంటే నాకు భయంనాస్తి
నాప్రేయసి వలపే నాకున్న ఆస్తి
కారుమబ్బులకిదుగో నా స్వస్తి"

అనేసి 'నాస్తి—నాస్తి' అనింకా పదాలకోసం తడుముకోవటం చూస్తుంటే నేను నవ్వాపుకోలేక పోయాను.

"ఇంకా చాలా పదాలున్నాయోయ్!..." హస్తి, విస్తిరి, జోస్తి, నాస్తి" అన్నాను.

గోపాలం చిన్నబుచ్చుకున్నాడు.

"నువ్వు నా కవితాకన్య నిలా అవమానిస్తా వనుకోలేదు. ఎంతమంది నన్ను చూడాలని పొంగి పోతుంటారో నీకేం తెలుసు? నేను సాహిత్య విమర్శ చేశానంటే అందరికీ గుండెలు అమాంతం ఆగిపోతాయి. త్వరలో ఓ సమితి స్థాపించి అందుకు నేనే అధ్యక్షత వహించి అందరిచేతా వుపన్యాసా లిప్పిస్తాను చూడు. నాకు 'వాకింగ్ క్రిటిక్' అని పేరు కూడా వుంది అన్నాడు. నే నేదో అనబో తుంటే వాడటుకేసి తిరిగి దీక్షగా చూస్తున్నాడు.

"ఆ అమ్మాయెలాగుంది?" అనడిగాడు.

"కళ్లో కొస్తుంది" అన్నాను.

"రైట్ ఆన్సర్-నిజంగా అప్సరసే! ఈమెలో యౌవనం వారధిగా ప్రవహిస్తోంది—ఓ గేయం అల్లమంటావా?"

"వద్దు బాబోయ్" అని బలవంతంగా వినిపిస్తా డేమోనని చెవులు మూసుకున్నాను.

నిజానికి ఆ అమ్మాయిలో అన్నిరకాల వికా రాలూ వున్నాయి. రోడ్డుచివర కూర్చుని జామి పళ్లు అమ్ముకుంటోంది. యౌవనం వుండవచ్చేమో కాని బుట్టెడు బొగ్గుల్లో ఓగాజు ముక్కెంత? మొహం నిండా మచ్చలు-ఇది గోపాలంకంటికి అప్సరసలా యెలా కనిపించిందా అని ఆశ్చర్య పోయాను.

అంతే—తరవాత గోపాలం చాలారోజులవరకూ కనిపించలేదు. తరవాత కొంత కాలానికి అతనికి పెళ్ళయిందని మావయ్యకూతుర్ని చేసుకోలేదని తెలిసింది. అతనికి నచ్చిన పిల్లఎలా దొరికిందాని మేమంతా ఆశ్చర్యపోయాం. తరవాత కొంత కాలానికి వాడిపెళ్ళాం లేచిపోయిందని కూడా తెలిసింది.

గోపాలం గురించి ఎంత ఆలోచించినా మాకు అతని సైకాలజీ అర్థంకాలేదు. అతను హఠాత్తుగా ఎందుకిలా ఘూరేడో. అతనిలో ఈ విపరీత పరిస్థితుల్ని సృష్టించంది ఏవిటో మాత్రం మాకు బోధపడలేదు.

ఆఖరుసారి నేను గోపాలాన్ని చూడటం పిచ్చాసుపత్రిలో——

★